


HarperCollins India
to publish
BELONGING
A JOURNEY OF LOVE
by
SONIA GANDHI
ON SALE 10 NOVEMBER 2026

'బిలాంగింగ్' పై
బిగ్ అప్ డేట్ 2



Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 27 | శనివారం 05 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi





## సీఎంను ప్రశ్నిస్తే దాడులా?

- ముస్లింలమని తెలిసిన తర్వాత మరింతగా కొట్టారు
- ఇద్దరు మహిళా జర్నలిస్టుల ఆరోపణలు
- ఢిల్లీ పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు
- ముఖ్యమంత్రి రేఖా గుప్తా పాల్గొన్న కార్యక్రమంలో ఘటన

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సాధారణ మహిళలకే కాదు.. మహిళా జర్నలిస్టులకూ విలువ లేకుండా పోతోంది. ఢిల్లీలో మహిళా జర్నలిస్టులపై పోలీసుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి రేఖా గుప్తా పాల్గొన్న ఓ కార్యక్రమంలో ఆమెను ప్రశ్నించేందుకు ప్రయత్నించిన తనను, తన తోటి ఉద్యోగి నఫీసా ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని సాకేత్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని జర్నలిస్ట్ షహీన్ ఖాన్ ఆరోపించారు. అక్కడ తమపై దాడి చేయడంతో పాటు మానసిక వేధింపులకు గురిచేశారని ఆమె వివరించారు. అంతేకాకుండా తమ పేర్లు తెలుసుకున్న పోలీసులు తాము ముస్లింలమని గుర్తించిన తర్వాత దాడి మరింత ఎక్కువైందని ఆరోపించారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం...

- మిగతా 2లో..




- జిఎస్ఎల్ విఎఫ్-17 ప్రయోగం సక్సెస్.. కక్ష్యలోకి ఈఓఎస్-05
- శ్రీహరికోట నుంచి శుక్రవారం తెల్లవారు జామున ప్రయోగించిన జిఎస్ఎల్ వి-17 రాకెట్
- ఈ రాకెట్ ద్వారా 2,367 కేజీల ఈ ఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశం: ఇస్రో చైర్మన్ నారాయణన్ వెల్లడి
- ఈ ఆర్థిక సంవత్సరంలో శ్రీహరికోట నుంచి ఇది రెండో విజయవంతమైన ప్రయోగం..
- తుఫానులు, వరదలు, కార్చిచ్చులు వంటి ప్రకృతి విపత్తులను ముందుగానే గుర్తించడంతో పాటు వాతావరణ మార్పులను నిరంతర పర్యవేక్షణ
- నిరంతరం నిఘా.. కీలకం కానున్న జిఎస్ఎల్ వి ఎఫ్ -17

## మరోసారి సత్తా చాటిన ఇస్రో..

దొరవారిసత్రం - సూర్య వాస్తవం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోట నుంచి శుక్రవారం తెల్లవారుజామున ప్రయోగించిన జిఎస్ ఎల్ వి-ఎఫ్17 రాకెట్ ద్వారా 2,367 కేజీల ఈఓఎస్ -05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశ పెట్టింది. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన ఈ ప్రయోగం ఇస్రోకు మరో కీలక విజయంగా నిలిచింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ.ఇస్రో మరో చారిత్రాత్మక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జిఎస్ఎల్ వి ఎఫ్ -17 ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోట నుంచి శుక్రవారం తెల్లవారుజామున జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా 2,367 కేజీల బరువున్న అత్యాధునిక ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. జిఎస్ఎల్ వి ఎఫ్-17 వాహకనౌక ద్వారా అడ్వాన్స్‌డ్ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశ పెట్టిందని ఇస్రో చైర్మన్ నారాయణన్ వెల్లడించారు.

- మిగతా 2లో..



## మృత్యుంజయులు...!

- నేపాల్-టిబెట్ ఆకస్మిక వరదలు
- తొమ్మిది రోజుల తర్వాత సొరంగంలో కార్మికులు సజీవం
- టన్నెల్ నుంచి సజీవంగా బయటపడిన ఇద్దరు కార్మికులు
- సహాయ సిబ్బందిలో చిగురించిన ఆశలు

ఖాట్మండు - సూర్య వాస్తవం

నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్ట్ టన్నెల్‌లో తొమ్మిది రోజుల పాటు చిక్కుబడిన ఇద్దరు కార్మికులను సహాయ సిబ్బంది రక్షించారు. విపత్తు తర్వాత ఈ టన్నెల్ ఎవరికీ కన్పించలేదు. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా బురదతో కప్పుకుపోయిన టన్నెల్‌ను సహాయ సిబ్బంది గుర్తించారు. సజీవంగా బయట పడిన 30 సంవత్సరాల సంజయ్ సాహ్ సహాయ సిబ్బందిని 'ఈ రోజు ఏ తేదీ' అని అడిగారు. మరో కార్మికుడు కబీర్ మహారాజన్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వీరిద్దరినీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఉదంతం నేపథ్యంలో సహాయ సిబ్బందిలో ఆశలు చిగురించాయి. టన్నెల్‌లో చిక్కుబడిన వారి ఆచూకీ కోసం వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

- మిగతా 2లో..

# చర్యల మాటేంటి?

- ముందు 'ఏటీఆర్'.. తర్వాతే కొత్త టాస్క్
- కలెక్టర్ల సమావేశంలో కీలక అజెండా ఇదే
- ఇచ్చిన ఆదేశాల వాస్తవ అమలుపై లోతైన సమీక్ష
- రెండు రోజుల సమావేశాల్లో ఇదే తొలి అంశం
- కలెక్టర్ల నుంచి పనితనం రాబట్టడమే లక్ష్యం
- శాఖల ప్రజంటేషన్లు, ఉపన్యాసాలు కుదింపు



అమరావతి - సూర్య వాస్తవం

కలెక్టర్ల సమావేశాల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు, గంటలకొద్దీ రిపోర్టు ప్రజంటేషన్లతోనే కాలం వెళ్లదీస్తున్నారన్న విమర్శలకు సర్కారు చెక్ పెట్టనుంది. ఈనెల 10-11 తేదీల్లో జరిగే ఎనిమిదో విడత జిల్లా కలెక్టర్ల సమావేశంలోనే ఇందుకు శ్రీకారం చుట్టనుంది. జిల్లా కలెక్టర్ల కార్యాచరణ ఏమిటి....జిల్లాల్లో ఏం సాధించారు....ఏ విషయాల్లో వెనకబడ్డారు...అందుకు గల కారణాలు ఏమిటి...గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు వాస్తవిక పరిస్థితి ఏమిటన్న కోణంలో ఈ దఫా సమావేశాలను నిర్వహించాలనుకుంటోంది. అంటే, గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు

- మిగతా 2లో..

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- కొడంగల్ నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో పరిశీలన
- ఎడ్యుకేషన్ హబ్‌లో పనుల తనిఖీ
- మద్దూరులో డిగ్రీ కళాశాల పనుల పరిశీలన
- హకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌లో పనులను త్వరగా పూర్తి చేయాలి
- నారాయణపేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతలపై చొరవ తీసుకోవాలని సూచన



బొంరాస్ పేట్/ కొడంగల్/ దామరగిద్ద - సూర్య వాస్తవం

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. సమీక్షించారు. హకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌లో పనులను వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నారాయణపేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల పనులపై కూడా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఆ ప్రాజెక్టుకు సరిపడా నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా నారాయణపేట జిల్లా మద్దూరుకు వెళ్లి... ఆ తర్వాత దౌల్తాబాద్ మండలం, దుద్యాల మండలంలోని హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ కు చేరుకున్నారు. ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు.

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## లండన్ పర్యటనకు తమిళనాడు సీఎం విజయ్..

చెన్నై- సూర్య వాస్తవం



తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎం విజయ్ తొలిసారిగా విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రానికి భారీగా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సెప్టెంబర్ 10 నుంచి 16 వరకు బ్రిటన్‌లో జరిగే పారిశ్రామికవేత్తల సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. ఈ అధికారిక పర్యటనలో ఆయన తన భార్య సంగీత, కుమార్తె దివ్యలను కలవనున్నారని

- మిగతా 2లో..

## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

- ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్
- ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ
- విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్



అమరావతి - సూర్య వాస్తవం

ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6 శాతం నుంచి 2026

- మిగతా 2లో..

# సీఎంను ప్రశ్నిస్తే దాడులా?

(మొదటిపేజీ తరువాయి)

ఓ ప్రయివేటు ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేఖా గుప్తా హాజరయ్యారు. ఆ సమయంలో ఆమెను ప్రశ్నించేందుకు షహీన్ ఖాన్ ప్రయత్నించగా పోలీసులు ఆమెను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ క్రమంలో తనను కొట్టారని షహీన్ ఆరోపించారు. నఫీసా ఖాన్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని మానసికంగా వేధించారని ఆమె పేర్కొన్నారు. నఫీసా శరీరంపై కనిపించిన గాయాలను కూడా ఆమె వీడియోలో చూపించారు. పోలీసు సిబ్బంది తన పేరు అడిగి 'ఖాన్' అని తెలుసుకున్న తర్వాత దాడి మరింత తీవ్రంగా మారిందని షహీన్ ఖాన్ ఆరోపించారు.

**జర్నలిస్టు సంఘాల ఆగ్రహం**

ఈ వ్యవహారంపై దేశంలోని ప్రముఖ జర్నలిస్టు సంఘాలు కూడా స్పందించాయి. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కార్ప్స్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, ప్రెస్ అసోసియేషన్, కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

**రాజకీయంగా దుమారం**

మహిళా జర్నలిస్టులపై దాడి విషయంలో కాంగ్రెస్, ఆప్ నేతలు తీవ్రంగా స్పందించారు. ఆప్ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ.. ఇద్దరు మహిళా రిపోర్టర్లను ముఖ్యమంత్రిని ప్రశ్నించినందుకు పోలీసులు క్రూరంగా కొట్టారని ఆరోపించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ జోక్యం చేసుకుని, ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆప్ నేత సోమనాథ్ భారతి కోరారు. ఢిల్లీ పోలీసుల రాజ్యంగా మారిందా? అని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ప్రశ్నించారు. ఒక జర్నలిస్ట్ ముస్లిం అని పోలీసులు తెలుసుకున్న తర్వాత దాడి తీవ్రత పెరగడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# లండన్ పర్యటనకు తమిళనాడు సీఎం విజయ్..

(మొదటిపేజీ తరువాయి)

ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు, నటి త్రిష కూడా అదే సమయంలో యూరప్‌లో షూటింగ్ నిమిత్తం ఉండటంతో వారిద్దరి కలయికపై కూడా చర్చ జరుగుతోంది.

# అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్‌ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్‌ఎఫ్‌ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్‌ఎఫ్‌ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్‌ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.

# మృత్యుంజయులు...!

(మొదటిపేజీ తరువాయి)

వరదల కారణంగా జలవిద్యుత్ ప్లాంట్ టన్నెల్స్‌లో చిక్కుబడిన వందలాది మంది కార్మికుల ఆచూకీ తెలియడం లేదు. కాగా విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 1,295కి చేరింది. చైనా వరదలలో 21 మంది చనిపోయారు. రెండు దేశాలకూ చెందిన ఐదున్నర వేల మంది గల్లంతయ్యారు. నేపాల్‌లో సుమారు పది వేల కుటుంబాలకు చెందిన 43,000 మందికి అత్యవసర మానవతాసాయం అవసరమని ఐరాస ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ) తెలిపింది. ప్రభుత్వ అంచనాల ప్రకారం 84,000 మందికి పైగా నిరాశ్రయులయ్యారు.

# 'బిలాంగింగ్' పై బిగ్ అప్ డేట్

హైదరాబాద్- సూర్య వాస్తవం

కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రచించబడిన ఆత్మకథ పుస్తకంపై బిగ్ అప్ డేట్ వచ్చింది. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'ను హార్పర్‌కాలిన్స్ ఇండియా నవంబర్ 10న ప్రచురించనుంది. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ ఆత్మకథ భారతదేశంలో 2026 నవంబర్ 10న ప్రచురించబడుతుంది. మన కాలంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న రాజకీయ ఆత్మకథలలో ఒకటైన 'బిలాంగింగ్' అత్యంత వ్యక్తిగతమైన కథ. ఇది భారతదేశ ప్రయాణంపై ఒక అరుదైన అంతర్గత దృక్పథాన్ని అందిస్తుంది," అని హార్పర్‌కాలిన్స్ శలో రాసింది. కాగా, పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా సదురు పుస్తకాన్ని పబ్లిష్ చేయట్లేదని వెల్లడించిన విషయం తెలిసిందే.

# జిఎస్ఎల్ విఎఫ్-17 ప్రయోగం విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)



ఉపగ్రహాన్ని 170 కి.మీ /29,000 కి.మీ కక్ష్యలోకి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకోగా,రాకెట్ మరింత మెరుగైన పనితీరును కనబరిచి 171 కి.మీ / 31,026 కి.మీ కక్ష్యలోకి విజయవంతంగా చేర్చిందన్నారు.దేశ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు.ఈ ఆర్థిక సంవత్సరంలో శ్రీహరికోట నుంచి ఇది రెండో విజయవంతమైన ప్రయోగం.మొదటిది స్కైరూట్ స్టార్టప్ ప్రయోగం కాగా.ఇస్రోకు ఈ ఏడాది ఇదే తొలి ప్రయోగం.ఈ ఏడాది కమ్యూనికేషన్ ఉపగ్రహాలతో పాటు,గగన్‌యాన్‌కు సంబంధించిన రెండు మానవరహిత ప్రయోగాలు కలుపుకొని మొత్తం ఆరు ప్రయోగాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. నారాయణన్ తెలిపారు.భారత ఉపఖండంపై నిరంతరం నిఘా ఉంచే అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహంగా ఈ మిషన్ కీలకం కానుంది.ప్రతి 30 నిమిషాలకు ఒకసారి.ప్రత్యేక పరిస్థితుల్లో కేవలం 5 నిమిషాలకే ఒకసారి కొత్త చిత్రాలను ఈ ఉపగ్రహం అందిస్తుంది.తుఫానులు ,వరదలు, కార్చిచ్చులు వంటి ప్రకృతి విపత్తులను ముందుగానే గుర్తించడంతో పాటు వాతావరణ మార్పులను నిరంతర పర్యవేక్షించేందుకు ఉపగ్రహం ఉపయోగపడుతుంది. అలాగే దేశ సరిహద్దులపై రియల్ టైమ్ వ్యూహాత్మక నిఘా ఉంచేందుకు,వాతావరణ మార్పులను నిత్యం కచ్చితత్వంతో పర్యవేక్షించేందుకు ఈ మిషన్ కీలకపాత్ర పోషిస్తుందని ఇస్రో తెలిపింది.అంతకుముందు.జీఎస్ ఎల్ వి ఎఫ్-17 ప్రయోగం నేపథ్యంలో ఇస్రో చైర్మన్ నారాయణన్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.వైకుంత క్యూ కాంప్లెక్సు నుంచి ఆనంద నిలయంలోకి వెళ్లిన నారాయణన్,జి ఎస్ ఎల్ వి ఎఫ్ -17,ఈ ఓఎస్-05 నమూనా రాకెట్‌ను శ్రీవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తర్వాత రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిని సీఎం పరిశీలించారు. వివిధ విద్యా సంస్థల భవన సముదాయాల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ.. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ వైద్య, వెటర్నరీ, నర్సింగ్, ఫిజియో థెరపీ, పారామెడికల్, ఇంజినీరింగ్ కాలేజీ, 430 పడకల ఆస్పత్రితోపాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలు, హాస్టళ్ల భవన సముదాయాలను పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో జరిగే అన్ని నిర్మాణాల విషయంలోనూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సీఎం అధికారులకు సూచించారు. నిర్మాణాల్లో నాణ్యత, ఇతర సాంకేతిక అంశాల విషయాల్లో ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని సూచించారు. వర్షాల సమయంలో నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేయాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్‌స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

**అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో సమీక్ష**

నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత సమీక్షా సమావేశంలో సీఎం సూచనలకు అనుగుణంగా మక్తల్-నారాయణపేట్- కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి పంప్ హౌస్ ల పనులను ముందుకు తీసుకెళుతున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఫేజ్-2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలిచి, ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు ప్రతి సంవత్సరానికి అవసరమైన బడ్జెట్‌కు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫేజ్-1 పనులను డిసెంబర్ 2027 నాటికి, ఫేజ్-2 పనులను అక్టోబర్ 2028 నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సీఎంకు అధికారులు వివరించారు. శుక్రవారం రాత్రి కొడంగల్‌లోనే సీఎం బస చేయనున్నారు. శనివారం కూడా కొడంగల్‌లో సీఎం పర్యటన కొనసాగనుంది. ఈ సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్దూరులో అభివృద్ధి పనుల పరిశీలన

నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పరిశీలించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం, నిర్మాణ విస్తీర్ణం, తరగతి గదులు, ప్రయోగశాలలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల భవనం పక్కన ప్రధాన రహదారి వైపు ఉన్న అదనపు భూమిని సర్వే చేయించాలని, అది పట్టా భూమి అయితే కొనుగోలు చేసి కళాశాలకు విశాలమైన ప్రాంగణం, ప్రహరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ముఖ్యమంత్రి సూచించారు.

అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాల నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# చర్యల మాటేంటి?

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా స్థాయిలో ఏ మేరకు అమలయ్యాయి....వాటి ఫలితాలు ఏమిటి....ఏ ఏ అంశాల్లో ముందడుగు వేయలేకపోయారు...ఇందులో ఉన్న సమస్యలేమిటనే వైపుగా చర్చ జరిగేలా ?(ఏటీఆర్- యాక్షన్ టేకెన్ రిపోర్టు) ప్రభుత్వం ఎనిమిదో విడత సమావేశ అజెండా రూపొందించింది. ఏడో విడత కలెక్టర్ల సమావేశం మే 7-8 తేదీల్లో సచివాలయం కేంద్రంగా జరిగింది. ఈ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు పలు కీలక ఆదేశాలిచ్చారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రెవెన్యూ, పరిశ్రమలు వంటి కీలక రంగాల్లో అనేక ఆదేశాలిచ్చారు. ఈసారి.. గత సమావేశాల్లో సీఎం, శాఖల కార్యదర్శులు ఇచ్చిన ఆదేశాలను కలెక్టర్లు ఏ మేరకు అమలు చేశారు ...

ఇచ్చిన లక్ష్యాలను సాధించారా... లేదా.. ఫలితాల సాధనలో జిల్లా ర్యాంకు ఎంత....టార్గెట్లను ఏ మేరకు పెండింగ్ పెట్టారన్న అంశాలపై ఈ దఫా సమావేశాల్లో తొలి అజెండాగా చర్చ జరగనుంది. దీన్ని ఆధారాలతో కూడిన చర్చగా ప్రభుత్వం పరిగణిస్తోంది. ఇదే తొలి అజెండాగా ఉంటుంది. ఆ తర్వాతే ఆర్థిక, ప్రణాళిక, ఇతర అంశాలపై చర్చిస్తారు. సమావేశాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించిన తర్వాత దీనిని అజెండాలో తొలి అంశంగా తీసుకుంటారు. ముఖ్యమంత్రి ఆదేశాలను జిల్లాలవారీగా అమలు చేయకపోయినా, అసంపూర్ణంగా వదిలేసినా, అసలు అమలే చేయకపోయినా...అందుకు గల కారణాలను కలెక్టర్ల నుంచి రాబట్టనున్నారు. ఏమీ చేయకున్నా, అన్నీ చేసేశామంటూ కొందరు కలెక్టర్లు తప్పించుకోవడం గత సమావేశాల్లో ప్రభుత్వం గమనించింది. ఈ నేప?థ్యంలో గత సమావేశాల ఏటీఆర్ ఏంటో ముందే సమావేశంలో ప్రజంటేషన్ ద్వారా వివరిస్తారు. కాబట్టి, ఆయా అంశాలపై కలెక్టర్లు విధిగా తమ ఏటీఆర్‌ను తెలియజేయాల్సి ఉంటుంది. కలెక్టర్ల సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలు అమలు కావడం లేదని, అయినా ప్రభుత్వం ప్రతిసారీ ఏటీఆర్‌పై చర్చ చేయకుండా కలెక్టర్‌లకు కొత్త టార్గెట్లు ఇస్తోందని, అవి జిల్లాల్లో అడుగు కూడా కదలడం లేదన్న విమర్శలున్నాయి. కలెక్టర్ల సమావేశాలు కలర్‌ఫుల్ ప్రజంటేషన్‌లు, ముఖ్యమంత్రి, కార్యదర్శుల ఉపన్యాసాలకు వేదికగా మారుతోందని, కలెక్టర్లు ఆశించిన స్థాయిలో పురోగతి చూపించడం లేదన్న ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు ఏవిధంగా ఉందో ముందు గుర్తించి, ఆ తర్వాత కలెక్టర్లతో మాట్లాడాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. అందుకే తొలిరోజు అజెండాలో దానిని మొదటి అంశంగా చేర్చారు. అయితే, కలెక్టర్లకు ఇచ్చిన టాస్క్‌లను నాలుగు కోణాల్లో పరిశీలించి ర్యాంకులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. లక్ష్యం, సాధన, ర్యాంకు ఆధారంగా ఏటీఆర్ పురోగతిని పరిశీలించనుంది. అయితే, ఈసారి సమావేశాల అజెండా, శాఖల ప్రజంటేషన్ కూడా విభిన్నంగా ఉండేలా ప్రభుత్వం ప్లాన్ చేసింది. ప్రతీ శాఖ ప్రజంటేషన్ ఇచ్చి, దానిపై కొంత చర్చ జరిగేదాన్ని కన్నా, అంశాల వారీగా గ్రూప్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఆర్థికం, వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, పాలన, సాంకేతికత, పెట్టుబడులు, భూములు, శాంతి భద్రతల కోణంలో గ్రూపులు ఏర్పాటుచేసి అందుకు సంబంధించిన అంశాలపై ప్రజంటేషన్లు, చర్చలు ఉండేలా అజెండాను సిద్ధం చేశారు.

కీలకమైన అంశాల్లో ఉపన్యాసాలు తగ్గించాలనుకుంటోంది. ఫలితాలు, వాస్తవిక పరిస్థితితో కూడిన ప్రజంటేషన్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటోంది. దాంట్లోనే అన్ని కోణాలు కనిపించేలా రూపొందించాలని, ఇప్పటికే ఇటు ఆయా శాఖల కార్యదర్శులు, అటు విభాగాధిపతులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. రెండో రోజు కలెక్టర్లతో ఓపెన్ ఫోరమ్ చర్చకు అవకాశం ఇవ్వనుంది. దీంట్లో కలెక్టర్ తన జిల్లా పరిధిలోని పలు అంశాలను ప్రస్తావించేలా అవకాశం ఇస్తారు. ఆ రోజు శాంతి భద్రతలపై చర్చ అనంతరం ముఖ్యమంత్రి కలెక్టర్లు, ఎస్పీలకు దిశానిర్దేశం చేసి సమావేశాన్ని ముగిస్తారు.

**తొలి రోజు...**

ఏటీఆర్‌పై చర్చ అనంతరం ఆర్థిక పరిస్థితులపై ప్రణాళిక, ఆర్థికశాఖల ప్రజంటేషన్లు ఉంటాయి. స్వర్ణాంధ్ర, సూపర్ సిక్స్, సంక్షేమ పథకాలు, తాగునీటి సరఫరా ప్రణాళిక, గృహ నిర్మాణం, ఉద్యోగ కల్పన, విద్య, వైద్య, ఆరోగ్యం, కొత్త పెట్టుబడి ప్రతిపాదనలు, జలధార, జిల్లాల ఉత్తమ పనితీరు మోడల్స్‌పై చర్చ ఉంటుంది.

**రెండో రోజు..**

ఉదయం ఈ-గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, పీజీఆర్‌ఎస్, డేటాలేక్ వంటి అంశాలపై చ ర్చ ఉంటుంది. అనంతరం పాజిటివ్ పబ్లిక్ పెర్‌సెప్షన్, రెవెన్యూ శాఖ, భూపరిపాలన, కేంద్ర ప్రాయోజిత పథకాలు, నిధుల వినియోగం, స్కిల్ డెవల్‌పమెంట్, ఉద్యోగ కల్పనపై దృష్టి సారిస్తారు. ఆ తర్వాత కలెక్టర్లతో ఓపెన్ ఫోరం ఉంటుంది. చివరిగా శాంతి భద్రతలను సమీక్షిస్తారు. చర్చను సాయంత్రం 5.20 గంటలకు ముగించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**అజెండాలో కనిపించని..ఎల్‌నినో**

కలెక్టర్ల సమావేశం అజెండాను అధికారులు ప్రాథమికంగా ఖరారు చేశారు. అయితే, ఇందులో ఎల్ నినో అంశం చేర్చలేదు. కరువు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఈ అంశాన్ని అజెండాలో చేర్చి కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాల్సి ఉంది.

# సంపాదకీయం

## సుభాష్ చంద్ర కేసులో ఏం జరుగుతోంది




మీడియా దిగ్గజం, ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో కీలక పరిణామం చోటు చేసుకుంది.రూ.22006.57 కోట్ల క్లెయిమ్‌లకు గాను కేవలం రూ.6.5 కోట్ల చెల్లింపు ప్రణాళికకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఈ దివాలా ప్రణాళికకు డివిజన్ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో ఎన్ సీ ఎల్ టీ ప్రెసిడెంట్ జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్ నేతృత్వంలో 5 మంది సభ్యుల ప్రత్యేక రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు చేశారు. ఎన్‌సీఎల్‌టీ చరిత్రలోనే ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి ఐదుగురు సభ్యుల ప్రత్యేక బెంచ్ సెప్టెంబర్ 1, 2026న ఈ కేసులో నోటీసులు జారీ చేసింది. అశోక్ కుమార్ భరద్వాజ్, రీనా సిన్హాలతో కూడిన రెండవ నంబర్ ఎన్‌సీఎల్‌టీ డివిజన్ బెంచ్ ఈ దివాలా ప్రణాళికపై ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. మూడో సభ్యుడైన నిలేశ్ శర్మ ఇచ్చిన స్వతంత్ర ఉత్తర్వు సైతం డివిజన్ బెంచ్‌లోని ఇద్దరితో విభేదించడంతో మేజారిటీ తీర్పు లేనందున ఎటువంటి తుది ఉత్తర్వులు ఇవ్వలేమని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. మెజారిటీ అభిప్రాయం రాకపోవడంతో కేసును ఎన్ సీ ఎల్ టీ ప్రెసిడెంట్‌కు పంపారు.కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 419 (5) ప్రకారం చరిత్రలోనే మొదటిసారిగా 5 మంది సభ్యుల ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్, జ్యుడీషియల్ సభ్యులు బచు వెంకట్ బలరామ్ దాస్, మహేంద్ర ఖండేల్వాల్, టెక్నికల్ మెంబర్స్ అతుల్ చతుర్వేది, రవీంద్ర చతుర్వేదిలు ఉన్నారు. సుభాష్ చంద్ర వ్యక్తిగత హామీలపై రూ.22,006.57 కోట్ల రుణాలకు సంబంధించి రుణ దాతల క్లెయిమ్‌లపై ఆయన దివాలా పరిష్కార ప్రణాళికకు వెళ్లారు. ఈ క్రమంలో కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపినట్లు వార్తలు వచ్చాయి. రూ.22 వేల కోట్లకు పైగా అప్పును రూ.6.5 కోట్లతో సెటిల్ చేసేందుకు 80.81 శాతం ఓటింగ్ ఉన్న రుణదాతలు ఆమోదం తెలిపారు. అయితే ఇది దాదాపు 99.97 శాతం రుణాల రద్దుకు దారితీస్తోంది.ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి 19.19 శాతం ఓటింగ్ కలిగిన సంస్థలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో ఇన్సాల్వెన్సీ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. సుభాష్ చంద్ర, అతని గ్రూప్ చాలా ఏళ్లుగా ఆర్థిక సంక్షోభంతో ఇబ్బంది పడుతోంది. వారి రుణ భారం క్రమంగా పెరుగుతూ వస్తోంది. కంపెనీలు తమ రుణాలను తిరిగి చెల్లించలేకపోయినప్పుడు విషయం కోర్టుకు చేరింది. నివేదికల ప్రకారం, ఎస్సెల్ గ్రూప్‌కు సుమారు ?22,006 కోట్ల భారీ అప్పు ఉంది. దీన్ని పరిష్కరించడానికి, సుభాష్ చంద్ర కేవలం ?6.5 కోట్ల తిరిగి చెల్లింపు ప్లాన్ ఇచ్చారు. దీనిని ట్రైబ్యునల్ ఆమోదించింది. అంటే రుణాలు ఇచ్చిన బ్యాంకులు తమ రుణాలపై భారీగా నష్టపోవాల్సి ఉంటుంది. ఈ కీలక నిర్ణయం ఆమోదానికి దారితీసిన న్యాయ ప్రక్రియ కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. సెప్టెంబర్ 2025లో, ఎన్ సీ ఎల్ టీ కి చెందిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం మధ్య రెండు విభిన్న అభిప్రాయాలు వెలువడ్డాయి. తదనంతరం, ఫిబ్రవరి 2026లో, ఈ విషయాన్ని ట్రైబ్యునల్ మూడో న్యాయ సభ్యుడైన నిలేష్ శర్మకు నివేదించారు. ఆయన ఈ ప్రణాళికను ఆమోదిస్తూ తన నిర్ణయాత్మక తీర్పును వెలువరించారు. అంతకుముందు, నవంబర్ 2024లో, రుణదాతల కమిటీ 80.814 శాతం ఓట్లతో ఈ ప్రణాళికను ఆమోదించింది. దివాలా, బ్యాంక్రప్టసీ కోడ్ ప్రకారం, ఏ ప్రణాళిక ఆమోదానికైనా 75 శాతం మెజారిటీ అవసరం,ప్రజలు తరచుగా ఎన్‌సిఎల్‌టిని ఒక కంపెనీగా భావిస్తుంటారు. కానీ వాస్తవానికి ఇది ఒక ప్రత్యేకమైన పాక్షిక–న్యాయ సంస్థ. దీని పూర్తి పేరు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్. దీనిని కేంద్ర ప్రభుత్వం, కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 408 కింద, 2016 జూన్ 1న అధికారికంగా ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని జస్టిస్ వి. బాలకృష్ణ ఎరాడి కమిటీ సిఫార్సుల ఆధారంగా ఈ సంస్థను ఏర్పాటు చేశారు. సాధారణ కోర్టుల ద్వారా కాకుండా, ఒక ప్రత్యేక వేదిక ద్వారా భారత్‌లో వ్యాపార, కార్పొరేట్ వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే దీని ప్రాథమిక ఉద్దేశ్యం.కార్పొరేట్ ప్రపంచానికి సంబంధించి ఎన్‌సిఎల్‌టి కి విస్తృత శ్రేణి అధికారాలు, బాధ్యతలు ఉన్నాయి. ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐఃఅ, 2016) ప్రకారం, కంపెనీలను దివాలా తీసినట్లు ప్రకటించడం లేదా వాటి రుణాలను పరిష్కరించడం వంటి విషయాలను ఇది విచారిస్తుంది. అంతేకాకుండా, రెండు లేదా అంతకంటే ఎక్కువ కంపెనీల మధ్య విలీనాలు, ఒక కంపెనీని విభజించడం లేదా కార్పొరేట్ పునర్నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలను కూడా ఇది ఆమోదిస్తుంది. వాటాదారులు, కంపెనీ యాజమాన్యం మధ్య వివాదాలను, లేదా నష్టాల్లో ఉన్న కంపెనీ చట్టపరమైన లిక్విడేషన్‌ను కూడా ఎన్‌సిఎల్‌టి పర్యవేక్షిస్తుంది.క్లెయిమ్‌లోని ప్రతి ?100కి రికవరీ మొత్తం కేవలం మూడు పైసలు మాత్రమే. ఈ కేసు ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతోంది..దివాలాలను పరిష్కరించడానికి, రుణాలను వసూలు చేయడానికి ఒక ఆధునిక చట్రాన్ని సృష్టించేందుకు దివాలా, బ్యాంక్రప్టసీ కోడ్, 2016ను రూపొందించారు. ఈ చట్టం కంపెనీలకు, కార్పొరేట్ రుణగ్రహీతలకు పూర్తిగా వర్తిస్తుంది. అయితే, వ్యక్తులు, భాగస్వామ్య సంస్థల దివాలా, బ్యాంక్రప్టసీకి సంబంధించిన ఐబిసిలోని పార్ట్ 3, సాధారణ ప్రజల కోసం ఇంకా పూర్తిగా అమలు కాలేదు.ఒక ముఖ్యమైన మినహాయింపు ఉంది. ఐబిసి ??ప్రకారం, ఒక కంపెనీ లేదా భాగస్వామ్య సంస్థ తీసుకున్న కార్పొరేట్ రుణానికి ఒక వ్యక్తి వ్యక్తిగత హామీ ఇచ్చి, ఆ తర్వాత రుణగ్రహీత చెల్లింపులో విఫలమైతే, ఆ వ్యక్తి దివాలా ప్రక్రియను ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే పెద్ద కార్పొరేట్ రుణాలకు సంబంధించిన కేసులలో వ్యక్తిగత దివాలా ప్రక్రియలను ప్రారంభించవచ్చు. అప్పుల్లో ఉన్న వ్యక్తి కేవలం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి దివాలా ప్రకటించుకోలేరు. వారు సాధారణంగా సంబంధిత న్యాయస్థానానికి వెళ్లి, అధికారిక న్యాయ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. అప్పులు తీసుకున్న వ్యక్తి ఒక న్యాయవాది సహాయంతో దివాలా కోసం దరఖాస్తు చేసుకోవాలి. అప్పులు ఇచ్చిన సంస్థలు, చెల్లించాల్సిన అప్పులు, ఆస్తులు, ఆదాయంతో సహా తమ ఆర్థిక పరిస్థితికి సంబంధించిన సమాచారాన్ని అందించాలి. ఆ వ్యక్తి తాము నిజంగా తమ ఆర్థిక బాధ్యతలను నెరవేర్చలేకపోతున్నామని, తమ అప్పులు చెల్లించే సామర్థ్యానికి మించి ఉన్నాయని నిరూపించుకోవాలి. ఆ తర్వాత న్యాయస్థానం కేసును విచారిస్తుంది, సంబంధిత పార్టీల వాదనలు వింటుంది. అవసరమైన విచారణలు జరుపుతుంది.దివాలా ప్రకటించడం అంటే కేవలం అప్పుల నుంచి విముక్తి పొందడం



# వాడిపోతున్న పండ్ల తోటలు..!

- బోర్లు తవ్విస్తున్నా చుక్కనీరు లేదు
- గార్లదిన్నె మండలంలో నీటి కొరతతో రైతుల విలవిల
- రైతుల కష్టం.... నిలువున ఎండుతుంది



**గార్లదిన్నె- సూర్య వాస్తవం:** గార్లదిన్నె మండల వ్యాప్తంగా సాగునీరు కొరతతో ఎక్కువ రైతులు దిక్కుతోచక విలవిలలాడిపోతున్నారని వైయస్సార్సీపి మండల కన్వీనర్ ఎక్కలూరు ఎల్లారెడ్డి ఒక పత్రికా ప్రకటనలో ఆవేదన వ్యక్త పరిచారు.ప్రస్తుతం సెప్టెంబర్ నెల గడిచిపోతున్నా వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు ఇంకిపోయి మండలంలోని అనేక గ్రామాల్లో బోర్లు ఎండిపోయాయని, కంటికి రెప్పలా కన్నబిడ్డలవలె పెంచుకున్న పండ్లతోటలు సాగునీరు అందక నిట్ట నిలువునా ఎండిపోతుంటే రైతులు కన్నీటి పర్వం చెందుతున్నారన్నారు. ముఖ్యంగా చీనితోటలరైతులు నీరులేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.చీనితోటలను కాపాడుకోవడానికి రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నారని, ఒక్కో ట్యాంకర్‌కు సుమారు 700 రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు. పంట చేతికొచ్చే వరకు ఇలా రోజులు, నెలలు నీటిని కొనుగోలు చేసి తోటలను కాపాడుకోవలసిన దౌర్భాగ్యం ఏర్పడిందని, ఇలా నీరు కొనడం చిన్న,సన్నకారు రైతులకు సాధ్యం కాదని ఆగ్రహం చెందారు. ఒకవైపు సాగునీరు లేక పంటలు ఎండిపోతుంటే, మరోవైపు ప్రజలకు తాగునీటి సమస్య, పశువులకు నీటిసమస్య కూడా తీవ్రంగా ఉందని ఎల్లారెడ్డి అన్నారు. హార్టికల్చరని పేరున్న గార్లదిన్నె మండలంలోనే రైతులు తమ తోటలను కాపాడుకోలేని దుస్థితి ఏర్పడడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.కనేకల్ చెరువుకు నీరు వస్తున్నప్పుడు, హెచ్ ఎల్ సి కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్నప్పుడు, మన ప్రాంతానికి రావాల్సిన నీటి విషయంలో ఎందుకు నిర్లక్ష్యం జరుగుతోందో అధికారులు, పాలకులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాలువల దిగువ ప్రాంతాలకు కూడా సక్రమంగా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎం పి ఆర్ డ్యామ్ కు సంబంధిత కాలువల పరిస్థితిపై అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. "రైతు పంట వేయలేకపోతే అది రైతుతప్పు కాదు. రైతుకు అవసరమైన సాగునీటిని అందించలేకపోవడం పాలకుల వైఫల్యం. నీటి కోసం రైతులు ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితిని వెంటనే మార్చాలి" అని ఎల్లారెడ్డి అన్నారు. ఎండిపోతున్న చీని తోటలు, పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని,హెచ్ఎల్సి నీటిని గార్లదిన్నె మండలానికి సక్రమంగా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే తాగునీరు, పశువుల నీటి సమస్యలను కూడా అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ఇది రాజకీయ కక్షతో అడుగుతున్న ఆవేదన, ఇది రైతు బతుకు కోసం అడుగుతున్న ప్రశ్న, మన ప్రాంత ప్రజల తాగునీటి కోసం అడుగుతున్న బాధని, రైతుల పంటలు, తోటలు ఎండిపోతుంటే చూస్తుంటే గుండెలు తరుక్కుపోతున్నాయన్నారు. గతంలో దివంగత మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితులలో కృత్రిమ వర్షాలు కురిపించాడని, అలాంటి ప్రయోగాలతోనైనా వర్షాలు కురిపించే రైతులను ఆగిపోవాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని ఆయన వక్కాణించారు.రైతులకు నీరు అందే వరకు ప్రజల తరఫున మాపోరాటం కొనసాగుతుందని ఎక్కలూరు ఎల్లారెడ్డి స్పష్టం చేశారు. అవసరమైతే దీక్షలు నిరాహార దీక్షలు ర్యాలీలు రాస్తారోకోలు ధర్నాలు లాంటి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.నీళ్లు మా హక్కు, రైతు బతుకు మా బాధ్యతన్నారు. హెచ్ ఎల్ సి నీటిని మన ప్రాంతానికి సక్రమంగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# అనంతపురంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు...!

- యాదవ భవన్‌లో గోపూజ నిర్వహించిన ఎంపీ
- వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు.. ఊంజల్ సేవలో భక్తుల సందడి
- శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు: ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ





**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో వేణుగాన మాధుర్యంతో, ధర్మబోధతో, ప్రేమానురాగాలతో జగత్తుకు మార్గదర్శకుడైన శ్రీకృష్ణ పరమాత్ముడు ధర్మాన్ని స్థాపించేందుకు శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడిగా అవతరించిన పవిత్ర దినమే శ్రీకృష్ణ జన్మాష్టమి. భాద్రపద మాసం కృష్ణపక్ష అష్టమి తిథిన రోహిణి నక్షత్రంలో శ్రీకృష్ణుడు జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి.కంసుడి దుర్మార్గ పాలనకు ముగింపు పలికి, ధర్మం, సత్యం, ప్రేమ, భక్తి, నీతి మార్గాలను శ్రీకృష్ణుడు ప్రపంచానికి బోధించాడు. మహాభారతంలో అర్జునుడికి అందించిన భగవద్గీత బోధనలు మానవాళికి శాశ్వత మార్గదర్శకంగా నిలిచాయి ఆ పరమాత్ముడి జన్మ దినమైన శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆలయాలు, యాదవ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, గోపూజ, ఊంజల్ సేవ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతపురంలోని నక్క రామారావు యాదవ్ భవన్‌లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపూజ నిర్వహించి, శ్రీకృష్ణ పరమాత్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాదవ సంఘం నాయకులు ఎంపీకి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం, సంతోషం నిండాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. యాదవ సోదర సోదరీమణులకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.అలాగే రాంనగర్ యాదవ భవన్‌లోని వేణుగోపాలస్వామిని ఎంపీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అరవింద మందిరంలో ఏర్పాటు చేసిన ఊంజల్ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.అశోక్ నగర్‌లోని సత్యదేవాలయంలో రమా సత్యనారాయణ స్వామివారు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో భక్తులను ఆకట్టుకున్నారు. జడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న గీతా మందిరంలో, అరవిందనగర్‌లో ప్రభోత సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏడు అడుగుల శ్రీకృష్ణ విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాల్లో యాదవ సంఘం నాయకులు రామకృష్ణ యాదవ్, నరసింహులు యాదవ్, పోస్టల్ కృష్ణయ్య యాదవ్, ఏపీఎన్‌జీవో మాధవయ్య, పరందయ్య యాదవ్, నారాయణస్వామి యాదవ్, గోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఇస్కాన్ టెంపుల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..**

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

సోములదొడ్డి గ్రామంలో వెలసి ఉన్న ఇస్కాన్ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా భక్తులందరికీ ఇస్కాన్ ప్రభుజీ మురళీకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.ఉదయం 4 గంటల 30 నిమిషాలకే స్వామివారికి మంగళహారతితో జన్మాష్టమి వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఉదయం 8 గంటలకు దర్శనం ప్రారంభమైంది.శ్రీకృష్ణుడి దర్శనం కోసం వేలాది మంది భక్తులు ఇస్కాన్ ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిట కిటలాడుతోంది. జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు శ్రీకృష్ణుడికి ఇష్టమైన ఉట్ల ఉత్సవం, 5 గంటలకు హనుమంత వాహన సేవ నిర్వహించనున్నారు.

## వాసుదేవ కళ్యాణ మండపానికి భూమిపూజ

**- ఎంపీ నిధుల నుంచి రూ. 50 లక్షలు అందిస్తాం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి మండలంలోని కొత్తపేట గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవ కళ్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన,భూ మిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అ నంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీ నారాయణ,రాష్ట్ర కా ర్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెం కట శివుడు యాదవ్,అనంతపురం జిల్లా యాదవ సంఘం మహిళా అ ధ్యక్షురాలు చంద్రగిరి రాధా యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు ని ర్వహించిన అనంతరం కళ్యాణమం డప నిర్మాణ స్థలంలో భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎంపీ అంబి కా లక్ష్మీనారాయణ మాట్లాడుతూకొ త్తపేటలో శ్రీ కృష్ణ ఆలయానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నా రు.యాదవుల ఆధ్యాత్మిక, సామాజి క అవసరాలకు ఉపయోగపడేలా నిర్మించనున్న వాసుదేవ కళ్యాణ మం డపానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఎంపీ నిధుల నుంచి రూ.50 ల క్షలు మంజూరుచే యడానికి కృషి చేస్తానని హామీ ఇ చ్చ రు.అనంతరం రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ శ్రీకృష్ణు ని ఆశీస్సులతో చేపట్టిన ఈ కార్యక్ర మం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కళ్యాణ మండపం నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంత ప్రజ లకు,యాదవ సంఘానికి ఎంతో ఉ పయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గుత్తి మం డల యాదవ సంఘం అధ్యక్షుడు 108 సీనా, అంబటి నరసింహులు, ఆధ్వర్యంలో నిర్వహించారు. యం శ్రీని వాసులు యాదవ్,ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ పవన్ కుమార్ యాదవ్, తిరుపాల్ యాదవ్,బాపనపల్లి ఆనంద్,జీఎస్కే సప్లైస్ సుంకన్న,పె ద్దొడ్డి వెంకట శివుడు, సూచంపల్లి భా స్కర్ యాదవ్, డీసీ పెద్దన్న, చిన్ రెడ్డి యాదవ్, లక్ష్మీ రంగయ్య యాదవ్, సునీల్,చికెన్ సీనా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం కొత్తపేట బై పాస్ దగ్గర వున్నా శ్రీ కృష్ణ మందిరంలో శుక్రవారం శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని గుంతకల్లు నియోజక వర్గం గుత్తి మండలం యాదవ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుం తకల్ నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు గుమ్మనూ రు జయరాం తనయుడు యువనేత గుత్తి, పామిడి ఇంచార్జ్ గుమ్మ నూరు ఈశ్వర్ ఈ సంద ర్భంగా గుమ్మనూరు ఈశ్వర్‌కి యాదవ సోదరులు ఘన స్వాగతం పలికి కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజ కా ర్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గుమ్మ నూరు ఈశ్వర్, యాదవ సోదరుల అతిథ్యాన్ని స్వీకరిం చడం జరిగింది.ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ, మండల యాదవ సోదరులు, కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా పి.మహబూబ్ షరీఫ్

**తనకల్లు- సూర్య వాస్తవం:** శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానో పాధ్యాయులు పి.మహబూబ్ షరీఫ్‌కు 2026 సంవత్సరానికి జిల్లా ఉత్తమ మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా ఎంపికయ్యారు. రేపు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయగా, పాఠశాల విధ్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచడం తొ పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో, విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేయడంలో పి. మహబూబ్ షరీఫ్ చేసిన కృషిని గుర్తించి విద్యా శాఖ అధికారులు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు.తనకల్ మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానో పాధ్యాయులు జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపిక కావడంతో మండల విద్యాశాఖ అధికారి ఎస్ లలితమ్మ మండల ఉపాధ్యాయులు యూనియన్ నాయకులు పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎంఆర్సి సిబ్బంది మీడియా ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. రేపు కొత్త చెరువు జిల్లా కేంద్రంలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి చెతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు.



# బస్సులో మంటలు...

**- 33 మంది ప్రయాణికులు సురక్షితం...!**
**- పెద్దవడుగూరు మండలం మిడుతూరు వద్ద ఘటన**





**అనంతపురం - సూర్య వాస్తవం :** బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు వద్ద శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. బస్సులో అకస్మాత్తుగా పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ప్రయాణికులను బస్సు నుంచి కిందకు దింపారు.బస్సులో ఉన్న 33 మంది ప్రయాణికులు క్షేమంగా బయటకు దిగిన కొద్దిసేపటికే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. దీంతో ప్రాణనష్టం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణంగానే బస్సులో మంటలు చెలరేగినట్లు గుర్తించినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఘటనాస్థలిని పరిశీలించిన జిల్లా ఎస్పీ పి జగదీష్...!**

**- మిడతూరు సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదం**



**–అగ్నిప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణకు ఆదేశం**

**– ఘటనపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఎస్పీ సూచన**

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పెద్దవడగూరు మండలం మిడతూరు సమీపంలోని జాతీయ రహదారిపై అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద తీవ్రతను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రమాదం ఎలా జరిగింది, బస్సులో మంటలు వ్యాపించడానికి గల కారణాలు ఏమిటనే వివరాలను స్థానిక డీఎస్పీ, సీఐలను అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట గుంతకల్లు డీఎస్పీ ఏ.శ్రీనివాస్, సీఐలు నరేంద్రరెడ్డి, శివశంకర్ నాయక్, ఎస్సై రాఘవేంద్రప్ప తదితరులు ఉన్నారు.

# పాసింగ్ అవుట్ పరేడ్‌కు సర్వం సిద్ధం...!

**- ప్రజాసేవలోకి అడుగుపెట్టనున్న 101 మంది యువ పోలీసు సిబ్బంది**
**- క్రమశిక్షణ, శారీరక దారుఢ్యంతో పరేడ్ నిర్వహించాలని సూచన**
**- రిహార్సల్స్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా శిక్షణ కేంద్రం (డీటీసీ)లో గత తొమ్మిది నెలలుగా కఠోర శిక్షణ పొందుతున్న 101 మంది సివిల్ కానిస్టేబుల్ .శిక్షణ తీసుకున్న వారి పాసింగ్ అవుట్ పరేడ్‌కు సర్వం సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన పరేడ్ రిహార్సల్స్‌ను జిల్లా ఎస్పీ పి.జగదీష్ పరిశీలించారు.శిక్షణ తీసుకున్న వారి నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏపీ పరేడ్, మార్చ్‌ఫాస్ట్, బ్యాండ్ మేళవింపు, కవాతు తీరును సమీక్షించారు. పరేడ్‌లో శిక్షణార్థుల ప్రదర్శన, క్రమశిక్షణ, సమన్వయాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. తొమ్మిది నెలలపాటు పొందిన కఠోర శిక్షణకు పాసింగ్ అవుట్ పరేడ్ గర్వకారణమైన ముగింపు కావాలని ఎస్పీ ఆకాంక్షించారు. క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, ఏకాగ్రతతో తుది పరేడ్‌ను మరింత అద్భుతంగా నిర్వహించాలని శిక్షణార్థులకు సూచించారు. ప్రజాసేవలో అడుగుపెట్టేందుకు 101 మంది యువపోలీసు సిబ్బంది సిద్ధమయ్యారు.



# అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

**- యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా భారీ ఎత్తున శ్రీకృష్ణుడి ఊరేగింపు**
**- భారీ ర్యాలీలో వెంకట శివుడి యాదవ్**





**పామిడి - సూర్య వాస్తవం:** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు స్థానిక పామిడి పట్టణంలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వ హించారు. మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిష్ఠాగలిష్టులై యాదవ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాహలంగా, వైభవోపేతంగా వేడుకలను నిర్వ హించారు. పట్టణంలోని స్థానిక పాండురంగ దేవాలయంలో పాండు రంగ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**ఆకట్టుకున్న యాదవుల అలంకరణ**

కృష్ణాష్టమి సందర్భంగా యాదవ సోదరులు సంప్రదాయ దుస్తులు తల పగాలతో ప్రత్యేక అలంకరణలతో పాల్గొని ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు యువత మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని శ్రీకృష్ణుని భక్తిని చాటుకున్నారు. పాండురంగస్వామి ఆలయం నుంచి అటవీశాఖ బంగ్లా వరకు భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. పామిడి పట్టణంలోని ప్రధాన పురవీధుల గుండా బాణాసంచా పేలుస్తూ డీజేల ద్వారా శ్రీకృష్ణుని విగ్రహాన్ని ట్రాక్టర్ లో ఉంచి గొర వయ్యల నృత్యం, డ్రమ్స్ వాయిద్యం, చెక్కభజనలు డీజేల ద్వారా శ్రీకృష్ణ గీతలా పనతో పట్టణమంతా మారు మ్రోగి పోయినది. బావసారక్షత్రియులు వైష్ణవులు, బ్రాహ్మణులు కూటమి నాయకులు సభ్యులు యాదవ సంఘం సభ్యులకు అభినందనలు తెలిపి కొనియాడారు. ఈకార్యక్రమానికి జిల్లా యాదవసంఘం అధ్యక్షులు రామకృష్ణయాదవ్ జాతీయ ప్రధానకార్యదర్శి రాజశేఖర్ యాదవ్, నరసింహులు, నారాయణస్వామి,రాష్ట్ర కార్యదర్శి ఓబిలేసుయాదవ్, పుంజా .కృష్ణారావుయాదవ్, కట్ట కింద పల్లి పెద్దిరెడ్డి, సుంకిరెడ్డి యాదవ్, ఓబిరెడ్డియాదవ్, రామాజినేయులు యాదవ్, పుంజా.నాగేష్ యాదవ్, రంగస్వామియాదవ్, ప్రభాకర్ యాదవ్, గోపాల్ యాదవ్ డ్రైవర్ నాగేంద్ర యాదవ్, రాఘవయాదవ్, నారాయణ స్వామి, తదితర యాదవ నాయకులు సంఘం సభ్యులకు, కుటుంబసభ్యులకు, మండల ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలను సంప్రదాయబద్ధంగా, ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్మిక శాఖ బోర్డు చైర్మన్ వెంకటశివయాదవ్ పాల్గొన్నారు. భజన సభ్యులతో కలిసి భజనలు చేస్తూ,పాటలకు నృత్యం చేసి వేడుకల్లో యాదవులు సమరోత్సాహం కల్పించారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్...!

**- కుటుంబ సభ్యులతో ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలు**



**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని నగర శివారులోని ఇస్కాన్ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించిన ఆయనకు ఇస్కాన్ ప్రతినిధులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు.

అనంతరం ఆలయంలో కొలువై ఉన్న శ్రీరాధాకృష్ణులను దర్శించుకుని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన ఉట్లోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం రాధాకృష్ణుల ఉంజల్ సేవలో పాల్గొన్నారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారులను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి వారితో ముచ్చటించారు. ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నియోజకవర్గ ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భగవంతుడి కృపతో నియోజకవర్గ అభివృద్ధి నిరంతరం కొనసాగాలని ప్రార్థించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## రైతుల ఆందోళనకు రంగయ్య మద్దతు..

**- ఎమ్మెల్యే స్పందన......**



**బెలుగుప్ప-సూర్య వాస్తవం:** మండలంలోని హనిమిరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు విద్యుత్ సమస్యలపై ఆందోళనకు దిగారు. లోవోల్టేజ్, విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఆరోపిస్తూ సబ్‌స్టేషన్ ఎదుట కళ్యాణదుర్గం--అనంతపురం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అటుగా వెళ్తున్న కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య రైతుల ఆందోళనను గమనించి వారికి మద్దతుగా రాస్తారోకోలో పాల్గొన్నారు. రైతులకు సకాలంలో, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వాహనం నిలిపి రైతుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎంపీ తలారి రంగయ్యతో మాట్లాడారు. రైతుల సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, విద్యుత్ సరఫరాను సక్రమంగా అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

## మానవత్వం చాటుకున్న పామిడి యువకులు



**పామిడి – సూర్య వాస్తవం :** పామిడి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఓ గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని అటుగా వెళ్తున్న ఆరోగ్యశ్రీ బాబు,నాగాసముద్రం అంజి వెంకటంపల్లి రవీంద్ర నాయక్ అతడిని గమనించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని చూసిన వారి మనసు చలించిపోయి వారు ముందుగా అతనికి స్నానం చేయించారు. ఆకలితో ఉన్న వ్యక్తికి భోజనం పెట్టారు. అనంతరం గాయాలతో బాధపడుతున్న అతడిని పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందేలా చేశారు. ప్రస్తుతం సమాజంలో మానవ సంబంధాలు దూరమవుతున్న తరుణంలో.ఎలాంటి పరిచయం లేని ఓ వ్యక్తిని సొంత మనిషిలా భావించి సేవ చేయడం పలువురిని కదిలించింది. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటి చెప్పారు. ఈ ముగ్గురు చికిత్స అనంతరం ఆ వ్యక్తి ముఖంలో కనిపించిన చిరునవ్వును చూసి ఎంతో సంతోషంగా అనిపించిందని వారు తెలిపారు. మనిషికి మనిషే తోడు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే అసలైన మానవత్వం అంటూ పలువురు వారి సేవాభావాన్ని అభినందిస్తున్నారు.ఈ ఘటన ద్వారా.ప్రేమ, ఆప్యాయతలు తగ్గుతున్న ఈ రోజుల్లో కూడా మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించారు ఈ ముగ్గురు యువకులు.

## మారుతి ప్రసాద్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మారుతి ప్రసాద్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు ఐదేళ్లుగా మారుతి ప్రసాద్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈయనకు పదోన్నతి లభించడంతో ఎస్ఐ సురేశ్, పోలీస్ సిబ్బంది అభినందించారు.

# ఉపాధ్యాయ వృత్తిని మించిన గొప్ప వృత్తి లేదు...!

**- 65 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం**
**- గురువుల సేవలను గుర్తించి గౌరవించడం అభినందనీయం: ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**




**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తిని మించిన గొప్ప వృత్తి మరొకటి లేదని తాను విశ్వసిస్తున్నట్లు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, వారి జీవితాలకు మార్గదర్శకులుగా నిలుస్తూ సమాజానికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్లో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మేరా యువ భారత్, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో గురుపూజోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరై డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 65 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. సమాజ నిర్మాణంలో గురువుల సేవలు ఎనలేనివని కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్‌ను ఎంపీ అభినందించారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించే ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి హృదయపూర్వక గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# అమ్మానాన్న ప్రేమ కరువై.. మత్తుకు బానిసై..

**- 14 ఏళ్లకే ఓ బాలుడి జీవితం నరకప్రాయం**
**- మత్తు పదార్థాలు సేవిస్తూ.. రైళ్లలో ప్రయాణిస్తూ..**
**- ఎట్టకేలకు అనంతపురం ఆర్పీఎఫ్ పోలీసులకు చిక్కి..**
**- అనంతరం సీడబ్ల్యూసీ ఛైర్ పర్సన్ మేడా రామలక్ష్మి ఆదేశాలతో బంధువులకు అప్పగింత**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** మనస్పర్ధలతో అమ్మానాన్న విడిపోగా.. ఒక్కగానొక్క కొడుకు (14)పై తీవ్ర ప్రభావం పడింది. మేనమామ వద్ద ఉంటూ పెరుగుతున్నా.. ఎందుకో దారి తప్పాడా బాలుడు. ద్విచక్ర వాహనాల టైర్ల పంక్చర్లకు వాడే సొల్యూషన్ ను సేవిస్తూ మత్తుకు బానిసైన బాలుడు రైళ్లలో ప్రయాణిస్తూ.. చివరకు అనంతపురంలోని ఆర్పీఎఫ్ పోలీసులకు చిక్కాడు. బాలుడిని తమ అదుపులోకి తీసుకొని మత్తు దిగాక విచారణ చేసి.. వివరాలు రాబట్టారు. ఆ మేరకు బంధువులను పిలిపించి బాలుడిని సురక్షితంగా అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలు అనంతపురం ఆర్పీఎఫ్ సీఐ సుధాకర్ రావు విలేకర్లకు శుక్రవారం తెలిపారు. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా అక్కల్ కోట్ తాలూకా గౌడ్గావ్ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలుడు ఈ నెల 2న బెంగళూరుకు వెళ్లే రైలులో ఎక్కాడు. మార్గమధ్యంలోని అనంతపురం స్టేషన్ కు రాగానే రైలును ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీ చేశారు. అయితే ఓ బాలుడు కదలలేని స్థితిలో మత్తులో పడిపోయి ఉండగా తోటి ప్రయాణికులను అడిగినా ఎవరూ సమాధానం చెప్పలేకపోయారు. దీంతో బాలుడిని అనంతపురం ఆర్పీఎఫ్ పోలీసులు దింపుకొని చైల్డ్ లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, సిబ్బంది ఇర్ఫాన్, కులశేఖర్, రమేశకు అప్పగించారు. ఆ తరువాత సీడబ్ల్యూసీ ఛైర్ పర్సన్ మేడా రామలక్ష్మి ముందు హాజరుపరిచారు. ఆమె ఆదేశాల మేరకు బెంగళూరులో ఉంటున్న మేనమామను పిలిపించి బాలుడిని అప్పగించారు. ఆయన అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వంపై ఉద్యోగుల సమరభేరి...

**- కొనసాగుతున్న ఉద్యోగుల ఉద్యమ బాట...!**
**- నాలుగో రోజు కొనసాగిన ఏపీజేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణ**
**- నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన..**
**- పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ : ఆర్.ఎన్. దివాకర్‌రావు**




**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం:** ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గం, ఉద్యమ కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల ఉద్యమ కార్యక్రమాలు నాలుగో రోజుకు చేరాయి. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలోని ఆర్టీసీ ఉద్యోగులు, ఎస్ఎల్‌టీఎస్ ఉపాధ్యాయులు, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం ప్రాంతాలకు చెందిన ఉద్యోగులతో కలిసి “చేయి చేయి కలిపి” కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులకు ఉద్యమం చేపట్టడానికి గల కారణాలు, న్యాయమైన డిమాండ్లపై నాయకులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తమకు రావాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి, ఐఆర్, డీఏలను తక్షణమే ప్రకటించాలి, పీఆర్సీ డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలి అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఏపీజేఏసీ అమరావతి సభ్యులు ఆర్.ఎన్. దివాకర్‌రావు (ఛైర్మన్), పి.ఎస్. ఖాన్ (జనరల్ సెక్రటరీ), వెంకట శివప్రసాద్ (ఆర్గనైజేషన్ సెక్రటరీ), సంతోష్ (ట్రెజరర్), అనంతపురం సిటీ యూనిట్ జనరల్ సెక్రటరీ పి.ఎస్.ఏ. ఖాన్, అనంతపురం డివిజన్ యూనిట్ ఛైర్మన్ అదిశేషయ్య, వీఆర్ఏ అసోసియేషన్ అధ్యక్షుడు వి. ఓబులేసు, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్ర, వీఆర్ఓ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందు నాయక్, ఏపీ పీటీడీ అసోసియేషన్ ప్రతినిధులు కొండయ్య, సోమశేఖర్, రత్నం తదితర ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీలో సత్తా చాటిన అల్ఫియా అంజుమ్

**- శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ద్వితీయ బహుమతి**




**హిందూపురం- సూర్య వాస్తవం :** శ్రీకృష్ణ జన్మాష్టమి--2026 సందర్భంగా హిందూపురం పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఇస్కాన్ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫ్యాన్సీ డ్రెస్, క్రీడలు, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంస్కృతిక అవగాహన, ఆధ్యాత్మిక విలువలు, ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణ స్థాయి పోటీల్లో విజేతలకు హిందూపురంలోని దీప్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించిన కృష్ణ చల మాతా కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీలో కొట్లపల్లి అల్ఫియా అంజుమ్ విశేష ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతిని సాధించింది. ఆమె శ్రీకృష్ణుని జీవిత చరిత్ర, తత్వచింతన, ఆధ్యాత్మిక సందేశం, ధర్మబోధనలు, కర్తవ్యం, ప్రేమ, మానవతా విలువలను తన వ్యాసంలో చక్కగా వివరించింది. వివిధ సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంప్రదాయాలను అర్థం చేసుకుని వాటిలోని మానవతా విలువలను స్వీకరించడం భారతీయ సంస్కృతిలోని భిన్నత్వంలో ఏకత్వం భావనకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. అల్ఫియా అంజుమ్ చూపిన ఆసక్తి, అవగాహన, రచనా ప్రతిభను న్యాయనిర్ణేతలు అభినందించారు. ఆమె సాధించిన విజయం కేవలం పోటీలో పొందిన బహుమతిగానే కాకుండా, యువతలో సామరస్యం, సాంస్కృతిక అవగాహన, సహనం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే స్ఫూర్తిదాయక ఉదాహరణగా నిలిచిందని తెలిపారు. అల్ఫియా అంజుమ్ ఆర్‌టీఐ ఎక్స్‌ప్రెస్ ఎడిటర్-ఇన్-చీఫ్, పబ్లిషర్ కొట్లపల్లి బాబా కుమార్తె.

ఈ సందర్భంగా ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో విద్యా, సాహిత్య, సృజనాత్మక రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# నిద్రమత్తులో లారీ బోల్తా.. తప్పిన పెను ప్రమాదం

- పూతలపట్టు--నాయుడుపేట జాతీయ రహదారిపై ఘటన
- డివైడర్‌ను ఢీకొని బోల్తాపడిన సరకు రవాణా వాహనం
- చిన్నపాటి గాయాలతో బయటపడిన డ్రైవర్.. కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** తెల్లవారుజామున డ్రైవర్ నిద్రమత్తు కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ బోల్తాపడిన ఘటన పెళ్లకూరు మండలం వడ్డిపాలెం సమీపంలోని పూతలపట్టు--నాయుడుపేట జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ప్రమాదంలో లారీ తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. బెంగళూరు నుంచి తెలంగాణలోని సిద్దిపేటకు యూరియా లోడుతో వెళుతున్న లారీ తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో వడ్డిపాలెం సమీపానికి చేరుకుంది. ఈ సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో వాహనంపై నియంత్రణ కోల్పోయినట్లు తెలుస్తోంది. దీంతో లారీ సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొని అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగంతో పాటు వాహనం దెబ్బతింది. అయితే డ్రైవర్‌కు అదృష్టవశాత్తూ స్వల్ప గాయాలు మాత్రమే కావడంతో ప్రాణాపాయం తప్పింది. గాయపడిన డ్రైవర్‌ను ప్రథమ చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. లారీ బోల్తాపడటంతో జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. జాతీయ రహదారుల సిబ్బంది సహకారంతో బోల్తాపడిన లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీంతో వాహనాల రాకపోకలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి. డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. పోలీసులు ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.



# తారు మిక్సింగ్ ప్లాంట్‌తో కాలుష్యం

- రోగాల బారిన పడనున్న నెలబల్లి గ్రామ ప్రజలు

**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** నేడు వాయు కాలుష్యంతో స్వచ్ఛమైన ఆక్సిజన్ అందక అనేక రకమైన శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు.నిబంధనలకు విరుద్ధంగా,ప్రజా నివాసాలకు,నిత్యం ప్రజలు సంచరించే ప్రాంతాలకు అతి సమీపంలో కాలుష్య పూరిత కర్మాగారాలు ఏర్పడడంతో ఆ పరిసర ప్రాంత ప్రజలు పలు రకాల శ్వాసకోశ సంబంధ వ్యాధుల బారిన పడే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇదే క్రమంలో దొరవారి సత్రం మండల పరిధిలోని చెన్నై-కలకత్తా జాతీయ రహదారికి అతి సమీపంలో,వాసమ్మ ఆశ్రమం వద్ద ఓ కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన తారు మిక్సింగ్ ప్లాంట్ నుండి కాలుష్య పూరిత దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని వాయు కాలుష్యం గా మారుస్తోంది. నెలబల్లి గిరిజన కాలనీ తో పాటు, హరిజనవాడకు సమీపంలో తారు మిక్సింగ్ ప్లాంట్ నిర్మాణం చేపట్టడం నిబంధనలకు పాతర వేసినట్లుగా ఉంది.తారు మిక్సింగ్ సమయంలో ఎత్తు లేని చిమ్నీ మసితో కూడిన పొగ సరాసరి గాలి ద్వారా గ్రామం వైపు వ్యాపిస్తోంది.దీంతో శ్వాసకోశ వ్యాధులైన ఆస్తమా,ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె నరాల సంబంధం వ్యాధులు సోకే అవకాశాలు మెండుగా ఉన్నాయి.గాలిలోని ప్రవహించే ధూళి, పొగ వల్ల శ్వాసనాళాలు వాపుకు గురై శ్వాస తీసుకోవడం కష్టతరం వంటి ఆరోగ్య సమస్యలు ఏర్పడనున్నాయి. వాయు కాలుష్యంతో ప్రమాదకర ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు కొందరు వైద్యులు అంటున్నారు.ప్లాంట్ నిర్మాణానికి అనుమతులు ఉన్నట్టా.లేనట్టా,కాలుష్య సంబంధం కర్మాగారాలు నిర్మాణానికి ప్రథమంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి పొందాలి.అనంతరం ఏర్పాటు చేయనున్న స్థలాన్ని కన్వర్షన్ జరగాలి, ఆయా పరిధిలో ఉన్న గ్రామ పరిపాలన వ్యవస్థనుండి అనుమతితో కూడిన ఎన్ ఓ సి పొందాలి,అదేవిధంగా ప్లాంట్ నిర్మాణం సమీపంలో ఉన్న గ్రామ ప్రజల అభిప్రాయం సేకరించాలి. ఆ యజమాని ఇలాంటి అనుమతులు పక్కన పెట్టి అనధికారికంగా ప్లాంట్ నిర్మించడం,ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. అంతేకాకుండా. జాతీయ రహదారికి 200 నుండి500 మీటర్లు దాటి ప్లాట్ నిర్మాణం జరిగి ఉండాలి.తెలుగు గంగా కాలువ బఫర్ జోన్ కు సమీపంలోనే నిర్మితమై ఉంది. పరిసర ప్రాంతం నలువైపులా దట్టమైన వృక్షాలు ఉండాలి.ప్లాంట్



పనిచేసేప్పుడు పొగను బయటకు విడుదల చేసే పొగ గొట్టం అతి తక్కువ ఎత్తులో ఉండడం వాయు కాలుష్యం అధికంగా జరుగుతోంది.

జాతీయ రహదారిపై నిత్యం వాహనాల్లో వెళుతున్న వారంతా కూడా రోడ్డుపైకి పొగ వెదజాలడం కలుషిత గాలిని పీల్చుకొనే పరిస్థితి ఏర్పడింది. నిబంధనలకు విరుద్ధంగా అర కొర అనుమతులతో తారు మిక్సింగ్ ప్లాంటు నిర్మాణం,ప్రజల ఆరోగ్యంతో చలగాట మాడిన ట్లుగా ఉంది.సంబంధిత పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు తక్షణం తనిఖీలు నిర్వహించి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్న ప్లాంటును. తొలగించి ప్రజలు వాయుకాలుష్య రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మురళీకృష్ణారెడ్డికి ఘనంగా జన్మదిన సత్కారం

- వేలూరు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు
- శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వేలూరు మురళీకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు పెళ్లకూరు మండలం శిరసనంబేడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టీడీపీ నాయకులు, యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో టీడీపీ యువ నాయకుడు, వి.కె.ఆర్. బ్రదర్స్ సివిల్ కాంట్రాక్టర్స్ వేలూరు కళ్యాణ్‌రెడ్డి , తన సోదరుడు వేలూరు సాయి గిరిధర్‌రెడ్డితో కలిసి మురళీకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించి, శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు.

**యువ నాయకత్వానికి ప్రతీకగా కళ్యాణ్‌రెడ్డి**

టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ శ్రేణులతో సమన్వయంగా ముందుకు సాగుతున్న వేలూరు కళ్యాణ్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడంలో కీలకంగా పాల్గొన్నారు. పార్టీ పెద్దలను గౌరవిస్తూ, యువతను కలుపుకొని కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కళ్యాణ్‌రెడ్డి చూపుతున్న చొరవను ఈ సందర్భంగా పలువురు నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా కళ్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ మురళీకృష్ణారెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజా జీవితంలో మురళీకృష్ణారెడ్డి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, పార్టీకి ఆయన చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేలూరు సాయి గిరిధర్‌రెడ్డి, మహేష్, రాజేంద్రప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొని మురళీకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా భద్రతపై
# పోలీసుల విస్తృత అవగాహన కార్యక్రమాలు

- మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన
- పోకసో, పోష్ చట్టాలపై అవగాహన
- సైబర్ నేరాలు,గంజాయి నిర్మూలనపై చైతన్యం
- రోడ్డు భద్రత,హెల్మెట్ వినియోగంపై అవగాహన
- వినాయక చవితి ఉత్సవాలపై కమిటీ సభ్యులకు సూచనలు
- స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రజలకు అవగాహన





**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని త్రినాధ్ ఇండస్ట్రీస్‌లో మహిళలు, చిన్నారుల భద్రత, పోకసో ,పోష్ చట్టాలు,సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, రోడ్డు భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గాజుల మాన్యం పోలీస్ స్టేషన్ పరిధిలో రేణిగుంట సడీపీవో ఆధ్వర్యంలో వివిధ గ్రామాల వినాయక చవితి కమిటీ సభ్యులతో సమావేశమై ఉత్సవాలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు సూచనలు చేశారు.తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్.సి.పురం జంక్షన్‌లో హెల్మెట్ ధారణ,రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగనాదపురం,ఎం.జి.నగర్ గ్రామాల్లో గంజాయి, సైబర్ నేరాలు,వినాయక చవితి, స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వెంకటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెరియవరం గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణ,సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, మహిళలపై నేరాల నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణే లక్ష్యంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం ప్రజలకు చేరువగా పని చేస్తోందన్నారు.

# వైసీపీకి షాక్

- కోటపోలూరులో కాంగ్రెస్‌లోకి జోగి వినోద్



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది.కోటపోలూరు గ్రామానికి చెందిన వైసీపీ యువ నాయకుడు జోగి వినోద్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురువం బాబు, సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ డి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో.ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం జోగి వినోద్‌కు తిరుపతి జిల్లా రైతు విభాగం అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా జోగి వినోద్ మాట్లాడుతూ."మా తాత,మా కుటుంబ సభ్యులందరూ గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారే.దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులుగా ఉన్నాము.అదే దిశలో నేను కూడా పయనించాలని నిర్ణయించుకుని కాంగ్రెస్ పార్టీలో చేరాను.పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తాను. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేసేందుకు నా వంతు కృషి చేస్తాను"అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,జోగి వినోద్ అనుచరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సూళ్లూరుపేట రాఘవయ్యపేటలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట పట్టణంలోని రాఘవయ్యపేటలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డా.నెలవల విజయశ్రీ విచ్చేసి,స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.నియోజకవర్గ ప్రజలందరూ పాడిపంటలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నారు.పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. విజయశ్రీ పాల్గొన్నారు.భక్తులకు ఎమ్మెల్యే స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు.పండుగ పూట పదిమందికి అన్నం పెట్టడం ఎంతో పుణ్యకార్యమని,ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని,ప్రశాంతతను పెంచుతాయని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక కూటమి నాయకులు,మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ చెంగాలమ్మ ఆలయంలో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ హాజరై,సామూహిక వరలక్ష్మీ వ్రతంలో కూర్చుని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆ చెంగాలమ్మ తల్లిని మరియు వరలక్ష్మీ దేవిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు.పవిత్రమైన శ్రావణ మాసంలో మహిళలందరూ ఒకచోట చేరి ఇలా సామూహికంగా వ్రతాలు ఆచరించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో శుభకరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతానికి ప్రైవేట్ లైన్ మ్యాన్ మృతి



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన శుక్రవారం దొరవారిసత్రం మండల పరిధిలోని పాలెంపాడు గ్రామంలో జరిగింది.ఆ గ్రామ దళిత వాడలో ఉన్న విద్యుత్ స్తంభం పై ఎక్కి సమస్య సరిచేయాలని నిమిత్తంతో ప్రైవేటు లైన్మెన్ గా పనిచేస్తున్న దొడ్డి గుంటకయ్య (36) విద్యుత్ ఘాతానికి బలై తీగలపైనే పడి మృతి చెందాడు. గుంటకయ్య ఎక్కిన త్రీ ఫేస్ స్తంభానికి ఇటు దళిత వాడలోని ట్రాన్స్ఫార్మర్,అటు బీసీ కాలనీలోని ట్రాన్స్ఫార్మర్ల విద్యుత్ సరఫరా జరుగుతుంది అని అక్కడి ప్రజలు అంటున్నారు.ఓవైపు మాత్రమే ట్రాన్స్ఫార్మర్ ఆపి స్తంభంపై ఎక్కడంతోనే విద్యుత్ ప్రమాద బారిన పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఈ సంఘటన చూసినవారు అంటున్నారు. ఏది ఏమైనా ఆ గ్రామానికి సంబంధించిన డిపార్ట్మెంట్ లైన్మెన్ ఆ సమయంలో అక్కడ లేకపోవడం, విద్యుత్ సరఫరా వంటి విషయాలు ప్రైవేట్ లైన్మెన్‌కు తెలియకపోవడంతో ప్రమాద బారిన పడి ప్రాణాలు విడిచినట్లు అంటున్నారు. ఇలాంటి నిర్లక్ష్యపు సంఘటనలలో ప్రైవేటు లైన్మెన్లు ఎందరో బలి అవుతున్నా డిపార్ట్మెంట్ తప్పిదాలను సరి చేయడం లేదని విమర్శిస్తున్నారు.జీవనోపాధి కోసం ప్రైవేట్ లైన్ మెన్ గా పనిచేస్తూ మృతి చెందడంతో భార్య,పిల్లల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది.

# చిరంజీవి 'కాకా'..
## సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్?లో భారీ షెడ్యూల్



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమా షూటింగ్‌పై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్?లో ప్రారంభం కానున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. చిరంజీవి సహా ప్రధాన తారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్ సుదీర్ఘంగా, అత్యంత కీలకమని చిత్రబృందం తెలిపింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా, "'కాకా' సెప్టెంబర్ 7 నుంచి మళ్లీ యాక్షన్‌లోకి దిగుతోంది. మెగాస్టార్ చిరంజీవి గారు, ప్రధాన తారాగణం పాల్గొనే సుదీర్ఘమైన, కీలకమైన షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది" అని పోస్ట్ చేసింది. దీంతోపాటు సినిమాను 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మరోసారి స్పష్టం చేసింది. ఇటీవలే చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'కాకా' టైటిల్ టీజర్?కు అద్భుతమైన స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో చిరంజీవి రావులపాలెంలోని 'అమ్మాజీ ఆక్వా ఇండస్ట్రీస్'లో సూపర్?వైజర్ సత్యంగా కనిపించారు. రొయ్యల చెరువులో పడిపోయిన తాళం చెవిని ఒక భారీ విద్యుదయస్కాంతంతో బయటకు తీయగా, దానితో పాటు తుపాకులు, ఇతర ఆయుధాలు రావడం టీజర్‌పై ఆసక్తిని పెంచింది. తాళం చెవికి ఉన్న 'ఐ లవ్ డాడ్' కీచైన్ సినిమాలో బలమైన భావోద్వేగ అంశం కూడా ఉందని సూచించింది. సినిమా వర్గాల నుంచి వస్తున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా ఉండబోతోందని తెలుస్తోంది. ఇటీవల చిత్రీకరించిన ఈ ఫైట్, సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలు సమపాళ్లలో ఉన్నాయని చిత్రబృందం నమ్మకంతో ఉంది. ఇప్పటికే ఫస్టాఫ్ ఎడిటింగ్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. ఈ భారీ చిత్రంలో అనశ్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్‌బస్టర్ విజయం సాధించడంతో 'కాకా'పై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.



### వేగంగా రజనీకాంత్ 'ధర్మన్' షూటింగ్..
## రెండో షెడ్యూల్ పూర్తి చేసిన సూపర్ స్టార్

సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా, అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'ధర్మన్' (తలైవర్ 173). ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్రం రెండో షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని ప్రముఖ నటుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ సంస్థ తమ సోషల్ మీడియా ఖాతాలో ఒక ప్రత్యేక వీడియో క్లిప్ విడుదల చేస్తూ, "ధర్మన్ రెండో షెడ్యూల్ పూర్తయింది. స్వాగ్ మోడ్: ఆన్" అని పేర్కొంది. విడుదల చేసిన వీడియోలో రజినీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ప్రొఫెసర్‌గా జూనియర్ డాక్టర్లకు లెక్చర్ ఇస్తున్నట్లు కనిపించారు. ఆగస్టు 13న ఈ సినిమా రెండో షెడ్యూల్ ప్రారంభమైంది. ఆ సమయంలో కూడా "ది డెడ్లీ డాక్టర్.. 'ధర్మన్' షెడ్యూల్ 2 మొదలైంది" అంటూ మేకర్స్ అప్డేట్ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన నాటి నుంచే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్‌లో రజినీకాంత్ లుక్‌ను ఎలా ఫైనల్ చేశారో చూపిస్తూ ఒక మేకింగ్ వీడియోను కూడా విడుదల చేశారు. ఈ చిత్రంలో రజినీకాంత్ నేరస్థులను ఎదుర్కొనే ఒక డాక్టర్ పాత్రలో నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా టైటిల్‌ను ప్రకటిస్తూ కమల్ హాసన్ "ధర్మమే వెల్లుం! (ధర్మమే గెలుస్తుంది)" అని ట్వీట్ చేశారు. విడుదలైన టైటిల్ పోస్టర్‌లో రజినీకాంత్ ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ పట్టుకుని, ఒక రౌడీ షీటర్ శరీరంపై కాలు వేసి నిలబడినట్లు కనిపించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ, ప్రదీప్ ఇ. రాఘవ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలు అన్బరివ్ స్టంట్లను కొరియోగ్రాఫ్ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఎస్. డిస్నీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



### 'బేబీ' జోడీ రిపీట్..
## ఆకట్టుకుంటున్న 'ఎపిక్' ట్రైలర్

బ్లాక్‌బస్టర్ హిట్ 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న కొత్త చిత్రం 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. యూత్‌ఫుల్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. '90s' వెబ్ సిరీస్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఆదిత్య హసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌ను బట్టి చూస్తే, ఈ సినిమా లండన్ కాలేజీ నేపథ్యంలో సాగే ఓ అందమైన ప్రేమకథ అని స్పష్టమవుతోంది. ప్రేమ, స్నేహం, భావోద్వేగాలు, జీవితంలోని మలుపులతో కథనం సాగనుంది. "ఒక ప్రేమకథ.. ఎన్నో భావోద్వేగాలు.. పూర్తికాని ఓ అధ్యాయం" అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దినట్టు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఆనంద్, వైష్ణవి మధ్య కెమిస్ట్రీ మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. వారిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలకు శ్రోతల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



### ఈ నెల 22న
## టీమిండియా, జపాన్ క్రికెట్ మ్యాచ్.. ఎందుకంటే..!




భారత్, జపాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు నెలకొని 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఈ మైత్రిని మరింత బలోపేతం చేసే దిశగా ఒక చారిత్రక క్రికెట్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. భారత్, జపాన్ దేశాల పురుషుల జట్ల మధ్య ఈ నెలలో ఒక ప్రత్యేక టీ20 అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. 'సుజుకి కప్' పేరుతో జరగనున్న ఈ మ్యాచ్‌కు సెప్టెంబర్ 22న జపాన్‌లోని టోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనే తకైచి మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన 'స్పోర్ట్ 75' ఒప్పందంలో భాగంగా ఈ మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. ఇరు దేశాల మధ్య క్రీడా సంబంధాలను, సాంస్కృతిక సహకారాన్ని ప్రోత్సహించడమే ఈ ఒప్పందం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ చారిత్రక మ్యాచ్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి దేవజిత్ సైకియా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ చారిత్రక ఘట్టంలో భాగం కావడం బీసీసీఐకి ఎంతో ఆనందంగా ఉంది. ఇది క్రికెట్‌కు చాలా ముఖ్యమైన క్షణం. భారత జట్టును జపాన్‌కు తీసుకెళ్లడం ద్వారా తూర్పు ఆసియాలో ఈ క్రీడను విస్తృత ప్రేక్షకులకు పరిచయం చేసే అవకాశం లభిస్తుంది" అని ఆయన తెలిపారు. భారత్–జపాన్ మధ్య బలమైన స్నేహ బంధం ఉందని, ఈ వేడుకల్లో క్రికెట్‌ను భాగం చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సంప్రదాయ దేశాలు దాటి ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ను విస్తరించే బాధ్యత తమపై ఉందని, ఈ దిశగా జపాన్ క్రికెట్ అసోసియేషన్ (జేసీఏ)తో కలిసి పనిచేస్తామని సైకియా వివరించారు. మరోవైపు, జపాన్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నవోకి మియాజీ మాట్లాడుతూ, "ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్లను జపాన్‌లో మా సొంత గడ్డపైకి ఆహ్వానించడం మా అసోసియేషన్‌కు ఒక చారిత్రక ఘట్టం. ఈ లక్ష్య సాధనకు సహకరించిన బీసీసీఐకి ధన్యవాదాలు" అని అన్నారు. భారత క్రికెట్ అభిమానుల ఉత్సాహానికి స్వాగతం పలుకుతున్నామని, స్థానిక జపనీయులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి తమ జట్టును ప్రోత్సహించాలని కోరారు. ఈ మ్యాచ్‌కు అభిమానుల తాకిడి అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్న నిర్వాహకులు, సానో మైదానం సామర్థ్యాన్ని 500 నుంచి 2,000కు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే అధికారిక సోషల్ మీడియా ఛానెళ్లలో టికెట్ల అమ్మకాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 24 నుంచి జపాన్‌లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రికెట్ జట్టు అక్కడికి వెళుతున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక మ్యాచ్‌ను ఏర్పాటు చేశారు. ఆసియా క్రీడల కోసం భారత జట్టుతో పాటు నెట్ బౌలర్లుగా లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ విక్కీ ఓస్త్వాల్, పేసర్లు రసిఖ్ సలామ్, కార్తీక్ త్యాగి కూడా జపాన్‌కు వెళ్లనున్నారు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో ఉన్న ఈ ముగ్గురు యువ బౌలర్లకు ఇది మంచి అవకాశమని, వారి పాస్‌పోర్ట్, వీసా ప్రక్రియలు కొనసాగుతున్నాయని బీసీసీఐ వర్గాలు తెలిపినట్లు ఐఏఎన్ఎస్ తన కథనంలో పేర్కొంది.




## దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సిరాజ్, పడిక్కల్.. సౌత్ జోన్ జట్టులో చోటు!

దులీప్ ట్రోఫీ ఫైనల్ పోరుకు భారత స్టార్ క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 6 నుంచి ఈస్ట్ జోన్‌తో జరగనున్న ఫైనల్ కోసం సౌత్ జోన్ జట్టులో వీరిద్దరికీ చోటు దక్కింది. ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లోనూ ఇద్దరూ భారత్ తరఫున ఆడారు. ఈ సిరీస్‌ను భారత్ 1–0తో గెలుచుకుంది. శ్రీలంక సిరీస్‌లో పడిక్కల్ అద్భుతంగా రాణించాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 328 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. మరోవైపు సిరాజ్ రెండు టెస్టుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్ కోసం వీరిద్దరూ సౌత్ జోన్ జట్టులో ఎవరిని భర్తీ చేస్తారన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు. టీ20 జట్టులో రెగ్యులర్‌గా ఉంటున్న వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా ఫైనల్‌లో ఆడే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబర్ 10న దులీప్ ట్రోఫీ ఫైనల్ ముగియనుండగా.. సెప్టెంబర్ 13 నుంచి ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. అయినా ఫైనల్‌లో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తిలక్ ఇప్పటికే చెప్పాడు. నార్త్ జోన్‌తో సెమీఫైనల్లో తిలక్ తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులతో ఆకట్టుకున్నాడు. సౌత్ జోన్ సెమీఫైనల్లో నార్త్‌ను 181 పరుగుల ఛేదనలో ఓడించింది. మరోవైపు ఈస్ట్ జోన్ 159 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఫైనల్ రేసు నుంచి తప్పించింది. ఇషాన్, సూర్యవంశీ ఆడకపోతే ఈస్ట్ జోన్ కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. బెంగాల్‌కు చాలాకాలంగా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అభిమన్యు ఈశ్వరన్‌కు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

## దేవకీ యశోద కృష్ణ ఆలయంలో



**రాయచోటి-సూర్య వాస్తవం:** రాయచోటిపట్టణంలోని గాలివీడు రింగ్ రోడ్డవరిగ పాపిరెడ్డిగారి పల్లె రోడ్డు వైపుఉన్న దేవకీ యశోద కృష్ణ ఆలయంలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ పాలకమండలి చైర్మన్ పదిలం మహేష్ కుమార్ యాదవ్ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను చేశారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఉదయం 8 గంటలకు గోపూజ, పంచామృత అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాదవితరణ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.





**పామిడిస్థానిక పామిడి శ్రీ సరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో...** శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఆనందోత్సవాల మధ్య జరిగింది. ఈ కార్యక్రమం లో ప్రధాన వక్తగా పామిడి పట్టణ పురోహితులు శ్రీ నాగరాజ శర్మ మాట్లాడుతూ అవతార పురుషుడు కృష్ణ భగవానుని జీవిత విశేషాలు విద్యార్థులకు చాకగా వివరించి చెప్పారు. అనంతరం విద్యా ర్థుల నృత్య ప్రదర్శనలు చిన్నారులు శ్రీ కృష్ణుని, గోపికల వేషధారణ, ఉట్టికొట్టే కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యక్షులు ఎన్.ఎస్. విశ్వనాథం, కార్యదర్శి బి.వి. రత్నమయ్య, ప్రాథమిక పాఠశాల అధ్యక్షులు ఎం. సునీల్ కుమార్ రెడ్డి కార్యదర్శి పి. చౌడయ్య మిగిలిన ప్రబంధకారిణి సభ్యులు, ప్రాథమిక, ఉన్నత పాఠశాల ల ఆచార్య బృందం, విద్యార్థులు పాల్గొని కార్యక్రమం విద్యార్థినీ విద్యార్థులు అందరూ పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

**అన్నమయ్య బ్యూరో ఎస్వీ విద్యామందిర్ హైస్కూల్‌లో...**





రాయచోటి లోని ఎస్వీ విద్యామందిర్ హైస్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థుల కోసం వివిధ సాంస్కృతిక, సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.... శ్రీకృష్ణుడు ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మం, న్యాయం వైపే నిలిచారని అన్నారు. జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా విద్యార్థులు ధర్మం, నిజాయితీ, న్యాయం మార్గాన్ని విడిచిపెట్టకూడదని సూచించారు. శ్రీకృష్ణుడు తల్లిదండ్రులను ప్రేమించి, గురువులను గౌరవించి, స్నేహితులతో ఆప్యాయంగా మెలిగారని, విద్యార్థులు కూడా అదే విలువలను జీవితంలో పాటించాలని తెలిపారు. మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆటలు, పాటలు, కోలాటం, ఉట్టి కొట్టే కార్యక్రమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను సందడిగా మార్చారు. ముఖ్యంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ శ్రీ నాగేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకృష్ణుని బోధనలు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

# నాయుడుపేటలో సమరశంఖం పూరించిన హస్తం పార్టీ

- మున్సిపల్, స్థానిక సంస్థల పోరుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలి
- డిసిసి అధ్యక్షుడు బాలగురువం బాబు
- ఆదేశాలతో నాయుడుపేటలో భారీ సమీక్షా సమావేశం
- ప్రతి బూత్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి డి.కిరణ్ కుమార్ పిలుపు



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** రాబోయే రోజుల్లో జరిగే మున్సిపల్, మండల స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విప్లవాత్మక విజయం సాధించడమే లక్ష్యంగా నాయుడుపేట పట్టణంలో పార్టీ శ్రేణులు సమరశంఖం పూరించాయి. తిరుపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ డిసిసి అధ్యక్షులు బాలగురువం బాబు ఆదేశాల మేరకు నాయుడుపేట మండల మరియు టౌన్ కమిటీ నాయకులతో అత్యంత కీలకమైన సమీక్షా సమావేశం నిర్వహించారు.

**అభ్యర్థులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి -- డి.కిరణ్ కుమార్:**

ఈ సమీక్షా సమావేశానికి సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ డి.కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు,నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్తూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు నాయుడుపేట పరిధిలోని ప్రతి ఓటింగ్ బూత్ పరిధిలో పార్టీ యంత్రాంగాన్ని అత్యంత బలమైన శక్తిగా తీర్చిదిద్ది, ప్రతి ఇంట్లోనూ కాంగ్రెస్ జెండా రెపరెపలాడేలా కష్టపడి పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ సమీక్షా సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నంబాకం హరికృష్ణ, జిల్లా కిసాన్ రైతు విభాగం అధ్యక్షులు జోగి వినోద్, నాయుడుపేట మండల అధ్యక్షులు తోప్పాని రవి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీను,సుధాకర్,వెంకట రమణయ్యలతో పాటు నాయుడుపేట మండల, టౌన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట..

**- మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో కీలక ఉత్తర్వులు జారీ- రేడియోగ్రాఫర్లు, నర్సులు, పీహెచ్‌సీ సిబ్బంది సమస్యలకు పరిష్కారం - ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ప్రోత్సాహకాలు**




**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విజ్ఞప్తులపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్,ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు సమీక్షలు నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులు కాంట్రాక్టు ఉద్యోగులకు ఊరట నిచ్చేలా కీలక ఉత్తర్వులు జారీ చేశారు.

**"రేడియోగ్రాఫర్లకు ప్రత్యేక సెలవులు"**

రేడియేషన్ ముప్పును ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ రేడియోగ్రాఫర్లు,రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్లకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. బోధనాస్పత్రుల్లో ఎక్స్‌రే,రేడియాలజీ విభాగాల్లో విధులు నిర్వహించే అర్హులైన సిబ్బందికి ప్రతి 11 నెలల విధి పూర్తయిన తర్వాత 30 రోజుల తప్పనిసరి ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఆదేశించింది. ఈ సెలవును సాధారణ లీవ్ ఖాతా నుంచి మినహాయించరాదని స్పష్టం చేసింది.

"సిబ్బంది సర్దుబాటుపై":-పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత,విధుల సర్దుబాటుపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని ఆదేశించింది. పగటి సమయంలో ఎంఎన్‌ఓలు,ఎఫ్ఎన్‌ఓల సేవలను, రాత్రి సమయంలో అవసరానికి అనుగుణంగా ఎస్‌ఏడబ్ల్యూల సేవలను వినియోగించాలని సూచించింది. ముఖ్యంగా రాత్రి విధులు నిర్వహించే సిబ్బందికి సహాయకంగా వీరి సేవలను ఉపయోగించుకోవాలని పేర్కొంది.

**నర్సులపై పని భారం తగ్గిస్తూ:** నర్సులపై ఉన్న 12 గంటల నిరంతర విధి భారం తగ్గించేలా కూడా చర్యలు తీసుకున్నారు. పీహెచ్‌సీలో ముగ్గురు నర్సులు పనిచేస్తున్న సందర్భంలో ఒకరు సెలవులో ఉన్నా,మిగిలిన సిబ్బందితో రొటేషన్ పద్ధతిలో విధులు సర్దుబాటు చేయాలని ఆదేశించారు. పగటి సమయంలో ఒక నర్సుపై 12 గంటల నిరంతర విధి భారం పడకుండా చూడాలని స్పష్టం చేశారు. స్థానికంగా అందుబాటులో ఉన్న ఏఎన్ఎం సేవలను సమర్థంగా వినియోగించుకుని విధులు సర్దుబాటు చేయాలని సూచించారు.

"పీహెచ్ సీ ల్లో విద్యార్థులకు శిక్షణ":-డీఎంఎల్‌టీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) విద్యార్థులకు కూడా పీహెచ్‌సీల్లో క్లినికల్ శిక్షణకు అవకాశం కల్పించారు. 6 లేదా 12 నెలల క్లినికల్ శిక్షణలో భాగంగా నెలరోజుల పాటు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో శిక్షణ పొందేలా మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యార్థులకు జిల్లా వైద్య,ఆరోగ్య అధికారులు శిక్షణ కేంద్రాలను కేటాయించనున్నారు.

**ఎన్టీఆర్ వివిఎస్‌టి కింద ప్రోత్సాహకాలు:**

శస్త్రచికిత్సలు, ప్రొసీజర్లకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా అందే ప్రోత్సాహకాల్లో డాక్టర్లతో పాటు వాటిలో పాల్గొనే కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బందికీ వారి క్యాడర్‌కు అనుగుణంగా నిర్ణయించిన వాటా ఇవ్వాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు,ఓటీ టెక్నీషియన్లు,అనస్థీషియా టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర సంబంధిత సిబ్బందిని కూడా అర్హత మేరకు చేర్చాలని స్పష్టం చేశారు. ప్రతి నెల శస్త్రచికిత్సలు,పాల్గొన్న సిబ్బంది, వారికి అందే ప్రోత్సాహక మొత్తాల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# కులాల వెంకటరమణకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

**నంద్యాల- సూర్య వాస్తవం:** పగిడ్యాల మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో పి జి టి -- జువాలజీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోలాల పరమేశ్వరుడు-- లక్ష్మీదేవి దంపతుల కుమారుడు వెంకట రమణయ్య నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం ఎన్. రంగాపురం గ్రామానికి చెందిన రమణయ్య విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన డా. కోలాల వెంకటరమణయ్య తన అంకితభావం, నిరంతర కృషి ఉత్తమ బోధనా పద్ధతులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, ఉన్నత విద్యావకాశాల వైపు ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన నంద్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం -- 2026కు ఆయన ఎంపికయ్యారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )